సాక్షి
వికారాబాద్
బుధవారం । 2 । ఆగస్టు । 2023



కలవరపెడుతున్న కళ్ల కలక
వానాకాలం సీజన్ వచ్చిందంటే చాలు వాతావరణ మార్పులతో అంటువ్యాధులు విజృంభిస్తాయి. 8లో▸



రక్షణ చట్టం కావాలి
న్యాయవాదులకు రక్షణ లేదు. ఇందు కోసం చట్టం తేవాలని కొడంగల్ బార్ అసోసియేషన్ లాయర్లు డిమాండ్ చేశారు. 8లో▸



బయోమె'ట్రిక్స్'
సర్కారు బడుల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. బయోమెట్రిక్ విధానం అభాసుపాలవుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండొద్దు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



పత్తి పంటను పరిశీలిస్తున్న గోపాల్ తదితరులు

దౌల్తాబాద్: పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మాటూరు గ్రామంలో పత్తి పంటలను ఆయన పరిశీలించారు. వర్షాలు తగ్గిన తర్వాత పత్తి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలను వివరించారు. అధిక వర్షాలతో తెగులు సోకే అవకాశం ఉందని, నివారణ కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదలు బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. ఏమైన సందేహాలు ఉంటే ఏఈఓలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మదరప్ప, ఏఈఓ శ్రీపతిరెడ్డి పాల్గొన్నారు.

వంద శాతం సబ్సిడీతో ఆర్థిక సాయం

వికారాబాద్ అర్బన్: క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద 2023 – 24 సంవత్సరానికి ఏదైనా యూనిట్‌ని స్థాపించే వారికి వంద శాతం సబ్సిడీతో ఆర్థిక సాయంపై నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ. 1.50 లక్షలు కలిగి ఉన్న వారు అర్హులని తెలిపారు. వయస్సు 21 నుంచి 55 ఏళ్లలోపు ఉండాలన్నారు. దరఖాస్తు దారుడు బీసీ – సీ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. చర్చి ద్వారా జారీ చేసిన బాప్టిసమ్ సర్టిఫికెట్ సమర్పించాలని తెలిపారు. www.tsobmmr.cff.gov.in లో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సెల్ నంబర్ 9440685713ని సంప్రదించాలన్నారు.

ఉచిత కోచింగ్

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ –3 పోటీ పరీక్షలకు అర్హులైన మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి 60 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఉంటుందని తెలిపారు. మైనార్టీ ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బుద్ధులు, జైనులు, పారశీలు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 6వ తేదీ లోపు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ల 9440685713, 99127 40115లో సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్ల బదిలీలు

జిల్లా నుంచి 14మంది ట్రాన్స్‌ఫర్, ఇతర జిల్లాల నుంచి 17మంది రాక

వికారాబాద్: త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ బదిలీలకు శ్రీకారం చుట్టింది. మంగళవారం జిల్లాకు చెందిన పలువురు తహసీల్దార్లను ఇతర బదిలీ చేసింది. 14మందిని ఇతర జిల్లాలకు బదిలీ చేయగా, ఆయా జిల్లాల నుంచి మన జిల్లాకు 17మంది బదిలీపై వచ్చారు. తాండూరు తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, దౌల్తాబాద్ తహసీల్దార్ బీ కృష్ణయ్య రంగారెడ్డి జిల్లాకు, దుద్యాల తహసీల్దార్ భీమయ్య, చౌడాపూర్ తహసీల్దార్ అశోక్‌కుమార్, కొడంగల్ తహసీల్దార్ బుచ్చయ్యను హైదరాబాద్‌కు, మర్పల్లి తహసీల్దార్ శ్రీధర్‌ను నల్గొండకు, పెద్దేముల్ తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, బంట్వారం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిలను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేశారు. కోట్‌పల్లి తహసీల్దార్ అష్ఫక్ రసూల్, ఎలక్షన్ సెల్ తహసీల్దార్ వహిదాఖాతున్, దోమ తహసీల్దార్ షామేదాబేగంను గద్వాల జిల్లాకు, సెక్షన్ ఇన్‌చార్జ్ సుధాను మేడ్చల్ జిల్లాకు, నవాబుపేట తహసీల్దార్ రవీందర్, యాలాల్ తహసీల్దార్ గోవిందమ్మను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి 17 మంది బదిలీపై రాగా ఇందులో ఎక్కువ మంది సంగారెడ్డి జిల్లాకు చెందిన వారే. ఆ జిల్లా నుంచి 12 మంది తహసీల్దార్లు ఇక్కడికి బదిలీపై వచ్చారు. మనోహర్ చక్రవర్తి, రమాదేవి, ప్రవీణ్‌కుమార్, మురళీధర్, కిషన్, ప్రభులు, జయరామ్, తారాసింగ్, పద్మావతి, బీ విజయ్‌కుమార్, సీ విజయ్‌కుమార్, ఆశాజ్యోతి సంగారెడ్డి జిల్లా నుంచి వచ్చారు. నారాయణ్‌పేట్ జిల్లాకు చెందిన దానయ్య, యాదాద్రి నుంచి గణేష్, మహబూబ్‌నగర్ నుంచి లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా నుంచి రాములు, జనగామ జిల్లా నుంచి గంగాభవాని వికారాబాద్ జిల్లాకు వచ్చారు. వీరికి బుధవారం కలెక్టర్ మండలాలు కేటాయించనున్నారు.

బతికి సాధించు..

సృష్టిలో పరిష్కారం లేని సమస్యంటూ లేదు..
చావే సొల్యూషన్ కాదు..
క్షణికావేశంలో తీసుకునే నిర్ణయం అనర్థాలకు దారి తీస్తుంది. ఇలాంటి తప్పుల వల్లే చాలా మంది అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. మనిషి జీవితంలో చావు చివరి ఘట్టం. దాన్ని ఎవరూ కావాలని కోరుకోరాదు.. చచ్చి ఏం సాధిస్తారు..
కుటుంబాన్ని శోకసంద్రంలోకి నెట్టడం తప్ప..

క్షణికావేశంలో ఆత్మహత్యలు
- ఏటా పెరుగుతున్న బలవన్మరణాలు
- కుటుంబాలను శోకసంద్రంలోకి నెట్టేస్తున్న వైనం
- జిల్లాలో రెండున్నరేళ్లలో 519మంది ఆత్మహత్య
- కళాజాత ప్రదర్శనలతో ప్రజలను చైతన్యం చేస్తున్న పోలీసు శాఖ



తాండూరు: యాలాల మండలం మల్‌రెడ్డిపల్లికి చెందిన గంగుల శారద, అంజిలప్ప దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్దమ్మాయి శిరీష(16) మానసిక సమస్యతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెందిన చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

- దోమ మండలం కిష్టాపూర్‌కు చెందిన నర్సింహులుకు ఒక కూతురు, ఒక కుమారుడు. నందు(15) స్థానికంగా ఉన్న పాఠశాలలో పదో తరగతి చదివేవాడు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాశాడు. గణితం సబ్జెక్టు తప్పాడు. సప్లిమెంటరీ పరీక్షలు రాసినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్తాపం చెందిన నందు గత నెలలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్కగానొక్క కొడుకు మరణించి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు.
- పరీక్షలు తప్పామని విద్యార్థులు, అప్పుల బాధతో వ్యక్తులు, రైతులు, భార్య లేదా భర్త కాపురానికి రావడం లేదని మరి కొందరు, వివాహేతర సంబంధాలతో ఇంకొందరు, ప్రేమ పేరుతో యువతి, యువకుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చిన్న చిన్న కారణాలతో బలిపీఠం ఎక్కుతున్నారు. 2021 జనవరి నుంచి 2023 జూలై వరకు జిల్లా వ్యాప్తంగా 519 మంది వివిధ కారణాలతో బలవన్మరణాలకు పాల్పడ్డారు. జిల్లా పోలీస్ శాఖ పరిధిలో తాండూరు, వికారాబాద్, పరిగి సబ్‌డివిజన్లు ఉన్నాయి. 23 పోలీస్‌స్టేషన్ల ద్వారా శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలో బలవన్మరణాలు అధికమయ్యాయి. రెండున్నరేళ్ల కాలంలో జిల్లాలో 519 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 2021లో 209 మంది, 2022లో 205 మంది, ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 105 మంది బలవన్మరణాలకు పాల్పడినట్లు పోలీసు అధికారులు ధ్రువీకరిస్తున్నారు. కేసులు నమోదు కానివి పదుల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం.

ఆత్మహత్యల్లో యువతి యువకులే అధికం

జిల్లాలో 15ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వారే బలవన్మరణాలకు పాల్పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. మానసిక స్థైర్యం కోల్పోయి చిన్నపాటి వివాదాలకు మరణమే శరణ్యంగా భావిస్తున్నారు. యువత బలవన్మరణాలు అధికంగా మద్యం సేవించిన సమయంలోనే ఎక్కువని వైద్యులు అంటున్నారు.

ఆత్మహత్యల నివారణకు పోలీసు శాఖ కృషి

ఆత్మహత్యలను అరికట్టేందుకు ఎస్పీ కోటిరెడ్డి ఏడాదిగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా కళాజాత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.పాఠశాలల్లో, కళాశాలల విద్యార్థులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. షీ టీం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

అందుబాటులో లేని కౌన్సెలింగ్ కేంద్రాలు

క్షణికావేశానికి గురయ్యే వారిని ముందుగా గుర్తించి మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తే ఆత్మహత్యలు తగ్గే అవకాశం ఉంది. కానీ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యక్తిత్వ మానసిక కౌన్సెలింగ్ కేంద్రాలు అందుబాటులో లేవు. తాండూరు జిల్లా ఆస్పత్రిలో మానసిక వైద్య నిపుణులు ఉన్నా విధులకు సరిగ్గా రావడం లేదనే బహిరంగ సత్యం.

జీవితం విలువైనది



మనిషికి సమస్యలు రావడం సర్వసాధారణం. సమస్యల కారణంగా ఒత్తిడికి లోను కారాదు. ఇటీవల కాలంలో విద్యార్థులు, యువకులే అధికంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అందుకు కారణాలు అనేకం. మద్యం మత్తులో మతి స్థిమితం కోల్పోయి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మానసికంగా కుంగిపోయి వారు ఎవరితో మాట్లాడరు. ఇంట్లో వస్తువులను విసిరేస్తారు. ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటామని అంటే వారిని వెంటనే మానసిక వైద్య నిపుణులకు చూపించాలి.

– డాక్టర్ జయప్రసాద్, ప్రభుత్వ వైద్యుడు

ప్రాణం పోతే తిరిగి రాదు



క్షణికావేశాలకు లోనై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మనిషి జీవితంలో సుఖ దుఃఖాలు సర్వసాధారణం. సంతోషాన్ని ఎలా పొందుతారో.. సమస్యను సైతం అలాగే స్వీకరించాలి. పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన జీవితంలో ఓడిపోయినట్లు కాదు. ఓటమి వెంటే గెలుపు ఉంటుందని గుర్తుంచుకోవాలి. జిల్లాలో ఆత్మహత్యలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగింది. రానున్న రోజుల్లో ఆత్మహత్యలను పూర్తిగా అరికట్టేలా పోలీసు శాఖ పని చేస్తోంది.

– కోటిరెడ్డి, ఎస్పీ, వికారాబాద్



కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

శాంతిభద్రతలపై నిర్లక్ష్యం వద్దు

- ఎస్పీ కోటిరెడ్డి
- కుల్కచర్ల సిబ్బంది పనితీరు బాగుందని కితాబు

కుల్కచర్ల: శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వకుండా ఫ్రెండ్లీ వాతావరణంలో పనిచేయాలని ఎస్పీ కోటిరెడ్డి పోలీసులకు సూచించారు. మంగళవారం ఆయన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి మాట్లాడారు. గ్రామీణ నేపథ్యం ఉన్న ఇక్కడి ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు, చట్టాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కలిపించాలన్నారు. క్రైం రేట్ తగ్గించేందుకు కుల్కచర్ల సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకట్రామయ్య, ఎస్‌ఐ శ్రీశైలం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు

అనంతగిరి: పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లాలో కో–ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లో కో–ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉన్న కో–ఆపరేటివ్ సొసైటీని వేరు చేసి వికారాబాద్ సొసైటీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి ఇద్దరు చొప్పున 800 మంది సభ్యులు, ఏడు మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా సొసైటీని సంప్రదించాలని సూచించారు. అనంతరం సొసైటీ రికార్డులను పరిశీలించారు. సొసైటీ ప్రెసిడెంట్‌గా ఎస్పీ, వైస్ ప్రెసిడెంట్‌గా అదనపు ఎస్పీ, సెక్రటరీగా డీఎస్పీ ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వీరేశం, ఇన్‌స్పెక్టర్లు రాజు, వెంకటేశం, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, కో–ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆగస్టు 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కొడంగల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.రాజారాం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 16వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు రెగ్యులర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



చంద్రాయణపల్లి తండాలో గిరిజనుల నృత్యం

సీత్లా సంబరం

ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని చంద్రాయణపల్లి తండాలో మంగళవారం గిరిజనులు సీత్లా పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. గిరిజన మహిళలు నైవేద్యంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు బాగా పండాలని, పాడిపశువులు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఊరేగింపులో యువతీయువకుల నృత్యాలతో సందడి నెలకొంది.

– ఆమనగల్లు

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

- కేంద్ర గ్రామీణాభివృద్ధి, స్వచ్ఛ సర్వేక్షణ్ అధికారి శివకుమార్



దిర్సంపల్లి మహిళలతో సమావేశమైన శివకుమార్, కృష్ణన్

దోమ: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై సర్పంచులు, ఎంపీటీలు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, స్వచ్ఛ సర్వేక్షణ్ అధికారి శివకుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని దిర్సంపల్లిలో డీఆర్‌డీఓ కృష్ణన్‌తో కలిసి పర్యటించారు. గ్రామ పరిసరాలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు,కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత అలవాటు చేసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్నందున పారిశుద్ధ్య మెరుగుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలను దూరం చేయవచ్చని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేస్తూ పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలన్నారు. మరుగుదొడ్లు లేనివారు నిర్మించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ టీం సభ్యులు, ఏపీడీ సరళకుమారి, ఎంపీడీఓ జయరాం, ఏపీఎం సురేశ్, ఏపీఓ దస్తయ్య, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ జబ్లీబాయి,ఉప సర్పంచ్ మోతీలాల్,పంచాయతీ కార్యదర్శి వెంకట నర్సింహులు పాల్గొన్నారు.

బీమా.. ఏదీ ధీమా?



షాబాద్ మండలం మీరాపూర్‌లో ఇటీవల కురిసిన వర్షానికి నీటమునిగిన పంట

- అతివృష్టి, అనావృష్టితో పంటలకు తీవ్ర నష్టం
- నాలుగేళ్లుగా పంటల బీమాపై స్పష్టత కరువు
- రైతులకు దక్కని పరిహారం

షాబాద్: కష్టాన్నే నమ్ముకుని ముందుకు 'సాగు'తున్న రైతన్నకు అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. అతివృష్టి, అనావృష్టితో ఏటా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నా బీమా అందడం లేదు. చెల్లింపుపై ప్రభుత్వం నాలుగేళ్లుగా స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు 4.10 లక్షల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, వరి, కంది, పెసర, మినుము, పూలు తదితర పంటలు సాగుచేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టితో పాటు పంటకు తెగుళ్లు ఆశించి దెబ్బతింటున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను పంటల బీమా పథకం ఆదుకునేది. ప్రస్తుతం ఆ బీమా లేకుండా పోయింది. గతంలో ప్రభుత్వం వానాకాలం, యాసంగి సీజన్ ప్రారంభమైన వెంటనే రైతుల నుంచి బీమా డబ్బులు తీసుకునేది. బ్యాంకర్లు తమ వద్ద పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి ముందుగానే బీమా డబ్బును జమ చేసుకునేవారు. ఎకరానికి పత్తికి రూ.1,700, వరికి రూ.1,200, ఇతర అన్నిరకాల పంటలకు రూ.300 నుంచి రూ. 500 వరకు ప్రీమియం వసూలు చేసేవారు. బీమా చేసుకున్న తర్వాత ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే బీమా కంపెనీలు పంటనష్టంలో 80 శాతం డబ్బును రైతులకు పరిహారంగా చెల్లించేవి. నాలుగేళ్లుగా బీమా సొమ్ము తీసుకోకపోవడంతో అన్నదాతలు నిరాశలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం సైతం అమలుకు నోచుకోవడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందే అవకాశాలు కనిపించడం లేదు.

తీవ్రంగా నష్టపోతున్నాం



అతివృష్టి, అనావృష్టితో పాటు పంటలకు తెగుళ్లు ఆశించి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పండించిన పంటకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం పంటల బీమా వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలి.

– క్యామ నారాయణ, రైతు, కుమ్మరిగూడ

ఆదేశాలు రాలేదు



పంటల బీమా పథకంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ఈ ఏడాది అమలు చేయలేదు. ఉత్తర్వులు అందితే బీమా సొమ్ము తీసుకుంటాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

ఎదురు చూపులే..!

- బదిలీలు, ప్రమోషన్ల కోసం ఉపాధ్యాయుల నిరీక్షణ
- కోర్టు కేసుతో ప్రారంభంకాని ప్రక్రియ
- ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని విన్నపం



మొత్తం పాఠశాలలు	1,054
జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు	3,055
బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు	2,226
జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు	563

వికారాబాద్ అర్బన్: పాఠశాలలు పునఃప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై నెలకొన్న సందిగ్ధత వీడడం లేదు. ఈ ఏడాది బదిలీలు ఉంటాయని ఉపాధ్యాయులు భావించారు. కానీ కోర్టు కేసు కారణంగా ప్రక్రియ ప్రారంభం కాలేదు. రెండు నెలల క్రితమే ఇతర శాఖల ఉద్యోగాల బదిలీలు, పదోన్నతులు జరిగిపోయాయి. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో కూడా బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. మాకే ఈ ఇబ్బందులు ఎందుకని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిదేళ్లలో ఒకే ఒక్కసారి

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకే ఒక్కసారి 2015లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. ఆ తరువాత దాని ఊసే లేకుండా పోయింది. అర్హతులు ఉన్నా పదోన్నతులు దక్కక ఉన్న గ్రేడ్‌లోనే ఉద్యోగ విరమణ పొందిన వారు ఎందరో ఉన్నారు. ఒకే చోట ఎనిమిదేళ్లు పూర్తి చేసుకొని బదిలీల కోసం ఎదురు చూస్తున్న వారి కళ్లు కాయలు కాస్తున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమై అర్థాంతరంగా ఆగిపోయాయి. దీంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు.

కేసు వేసింది ఉపాధ్యాయులే

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపడతామని ప్రభుత్వం జనవరిలో ప్రకటించి దరఖాస్తులు స్వీకరించింది. బదిలీల్లో స్పౌజ్ కేసులు ఉన్నవారికి పాయింట్లు ఎక్కువ ఇవ్వడంతో నాన్ స్పౌజ్ వారు తమకు అన్యాయం జరుగుతోందని వికారాబాద్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడు, చేవెళ్లకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు కోర్టును ఆశ్రయించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. ఈ ఇద్దరు ఉపాధ్యాయుల వల్లే ప్రక్రియ ఆగిపోయిందని కొందరు ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. 317 జీవోలో హైదరాబాద్ వెళ్లిన కొందరు ఉపాధ్యాయుల ప్రోత్బలంతోనే వీరు కోర్టుకు వెళ్లారనే విమర్శలు కూడా ఉన్నాయి. స్పౌజ్ పాయింట్లు ఇవ్వడంతో కోర్టును ఆశ్రయించిన ఇద్దరు ఉపాధ్యాయులకు లాభం లేదు, నష్టం లేదని తోటి ఉపాధ్యాయులు అంటున్నారు.

పదోన్నతుల కోసం ఎదురు చూపులు

ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు సుమారు 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకొని పదోన్నతులు దక్కక అదే కేడర్‌లో పనిచేస్తున్నారు. అదే కేడర్‌లో ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంలుగా, జీహెచ్‌ఎంలు ఎంఈఓలుగా పదోన్నతులు దక్కుతాయనే ఆశతో ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా బదిలీల ప్రక్రియ ఆగిపోవడంతో చాలా మంది ఉపాధ్యాయులు వారి పలుకుబడిని ఉపయోగించి ప్రత్యేకంగా బదిలీ ఉత్తర్వులు తెచ్చుకొని వారికి అనుకూలంగా ఉన్న స్కూళ్లలో చేరిపోయారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ప్రభుత్వం చొరవ చూపాలి



ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలి. బదిలీలు నిలిచిపోవడం వల్ల వేలాది మంది ఉపాధ్యాయులకు నష్టం జరుగుతోంది. వెంటనే ప్రక్రియను ప్రారంభించాలి.

– చంద్రశేఖర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

సర్కారుకు చిత్తశుద్ధి లేదు

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. అందుకే కోర్టు కేసులను పరిష్కరించడం లేదు. ప్రభుత్వం అనుకుంటే ఒకే ఒక్క రోజులో పరిష్కారం చేయవచ్చు. కానీ అలా చేయడం లేదు. సర్వీస్ రూల్స్ పాటించకుండా ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది.

– వెంకటరత్నం, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

హరిదాస్‌పల్లిలో తల్లిపాల వారోత్సవాలు



బాలింతలు, గర్భిణులకు గుడ్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ వెంకటేశ్వరమ్మ

ధారూరు: తల్లిపాల వారోత్సవాలను ఈ నెల 7వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని వికారాబాద్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ అంగన్‌వాడీచర్లను ఆదేశించారు. ధారూరు మండల పరిధిలోని హరిదాస్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. మూడేళ్లలోపు పిల్లలకు ప్రతినెలా 16 గుడ్లు, ఒక బాలామృతం ప్యాకెట్ ఇవ్వాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సెంటర్లలోనే భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ టీచర్ చిట్టెమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడికి డాక్టరేట్



రమేష్‌బాబును సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత అధ్యాపకుడిగా బోధన చేస్తున్న రమేష్‌బాబు.. రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీలో నిర్వహించిన గణితశాస్త్ర పరిశోధనలో డాక్టరేట్ అందుకున్నారు. 'ఏ రీసెర్చ్ ఆన్ కంపేరిటివ్ స్టడీ డిఫరెంట్ డామినెన్స్ రిలేటెడ్ కాన్సెప్ట్' కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చాటినందుకు డాక్టరేట్ అందుకున్నట్లు రమేష్‌బాబు తెలిపారు. 'క్యాలుక్‌లేషన్ అండ్ సమ్ స్పెషల్ ఫంక్షన్స్' అనే అంశంపై నిర్వహించిన గణిత శాస్త్ర పరిశోధనలో డాక్టరేట్ అందుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రమేష్‌బాబును మంగళవారం కళాశాల ప్రిన్స్‌పల్ రాజారాం, వైస్ ప్రిన్స్‌పల్ రఫియాఖానం, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాండూరు టౌన్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు. మంగళవారం ఉదయం తాండూరు, రుక్మాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 55 ఏళ్ల వయసున్న వ్యక్తిని రైలు ఢీకొనగా.. అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు బనీయన్, నీలిరంగు గడుల లుంగీ ఉన్నట్లు వెల్లడించారు. మృతదేహాన్ని తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 95531 95100లో సంప్రదించాలన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన బైక్

ద్విచక్ర వాహనదారుడు మృతి

పహాడీషరీఫ్: డీసీఎంను వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కావిడి మండలానికి చెందిన కేత హరిబాబు(38) సర్దార్‌నగర్‌లో నివాసం ఉంటూ హార్డ్‌వేర్ పార్కులో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 11గంటలకు విధులు ముగించుకొని శ్రీశైలం హైవే మీదుగా తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ ఇండికేటర్ వేయకుండా ర్యాష్‌గా ప్రయాణిస్తుండడంతో గమనించని ద్విచక్రవాహనదారుడు బైక్‌తో డీసీఎంను ఢీకొట్టాడు. ఈ ఘటనలో హరిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకు పోలీసులు క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. మృతుడి సోదరి సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలవరపెడుతున్న కళ్ల కలక

- పెరుగుతున్న కేసులు
- వైరస్ బారిన పడుతున్న విద్యార్థులు
- అప్రమత్తతోనే సురక్షితం



కళ్ల కలక బారిన పడిన వ్యక్తికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, (ఇన్‌సెట్‌లో) కళ్ల కలకతో ఎరుపెక్కిన మహిళ కన్ను

తాండూరు/బషీరాబాద్: వానాకాలం సీజన్ వచ్చిందంటే చాలు వాతావరణ మార్పులతో.. అంటువ్యాధులు జనంపై మూకుమ్మడిగా దాడి చేస్తుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలతో కళ్ల కలక విజృంభిస్తూ.. ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. దశాబ్ద కాలం క్రితం వరకు అధిక ప్రభావం చూపిన కలక.. మళ్లీ అదే పంథాలో ఉధృతి చెందుతోంది. వారం రోజుల వ్యవధిలో జిల్లాలో 800లకు పైగా కేసులు నమోదు కావడం, అందులో విద్యార్థులపై ఎక్కువగా ప్రభావం చూపడం ఆందోళన కలిగిస్తోంది.

వాతావరణం మార్పుతో..

జిల్లాలో వారం రోజులుగా కళ్ల కలక (కంజంక్టివైటిస్) బ్యాక్టీరియా ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. వాతావరణంలో మార్పుతో కళ్ల కలక దాడి పెరిగింది. జన సమూహంగా ఉన్న ప్రాంతాల్లో వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. వ్యాధి లక్షణాలు అధికంగా ఉన్న వారికి కంటి చూపు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వందల సంఖ్యలో దాని బారిన పడగా.. మంగళవారం ఒక్క రోజే తాండూరు మండలం జినుగుర్తి మోడల్ స్కూల్ విద్యార్థులు బాధితులుగా మారారు. అంతే కాకుండా తాండూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు బ్యాక్టీరియా బారిన పడ్డారు. బొంరాస్‌పేట్, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల్లో వైరస్ బారిన ప్రజలతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.

వ్యాధి లక్షణాలు.. ఉపశమనం

కళ్ల కలక వ్యాధిన పడిన వారికి రెండు కళ్లు ఎరుపు, గులాబీ రంగులోకి మారిపోయి తీవ్రమైన మంట పుట్టిస్తాయి. నిద్రపోయి లేచే సరికి రెండు కనురెప్పలు అతుక్కుపోయి కళ్లు తెరవని పరిస్థితి ఏర్పడుతుంది. కళ్లలోంచి నీరు ధారలా కారుతుంటుంది. మరోవైపు కంటిలో నుంచి మలినాలు(చీము) తరచూ వస్తుంటుంది. కొంత మందికి జలుబు చేసినా.. కలక రావడం సహజంగా ఉంటుంది. జలుబు కారణంగా ఏర్పడిన కళ్ల కలకతో వ్యాప్తి ఉండదు. లక్షణాలు ఉంటే కళ్లు నలపడం, లేదా చేతులు పెట్టడం చేయరాదు. శుభ్రమైన గుడ్డతో తరచూ తుడుచుకోవాలి. నల్లటి అద్దాలు పెట్టుకోవడం ద్వారా కొంత ఉపశమనం కలుగుతుంది. వైరస్ వలన బాధపడుతున్న వారికి వారం రోజుల్లో తగ్గిపోయే అవకాశం ఉంది. రోగ నిరోధక శక్తి అధికంగా ఉన్న వారికి ఈ వ్యాధి నుంచి త్వరగా బయట పడతారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం



కళ్ల కలక సోకిన వారు శుభ్రత పాటించాలి. కంటిని శుభ్రమైన తడిగుడ్డతో తుడుచుకోవాలి. దుమ్ము, ధూళి, కాలుష్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో సమస్య మరింత పెరుగుతోంది. ఎప్పటికప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవడం మంచిది. విపరీతమైన మంట, దురద పెడితే నిర్లక్ష్యం చేయరాదు. కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అలాంటి వారు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందాలి.

– డా. స్వామినాథ్, కంటి వైద్యులు, నోడల్ ఆఫీసర్, వికారాబాద్ జిల్లా

అప్రమత్తత అవసరం



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: కళ్ల కలక వ్యాధిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మాధురి, డాక్టర్ పుష్పలత అన్నారు. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి మాట్లాడారు. కళ్ల కలక వ్యాపిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని, కళ్లను వేళ్లతో ఎక్కువగా తాకకుండా, ఎప్పటికప్పుడు కళ్లను, చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళ్లు ఎర్రగా మారడం, వాంతులు, విరేచనాల లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్, గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగారాంనాయక్, వైద్య సిబ్బంది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వ్యాప్తి



ఇంటింటికీ తిరిగి వ్యాధి లక్షణాల గురించి వివరిస్తున్న వైద్య సిబ్బంది

దౌల్తాబాద్: మండలంలో కళ్ల కల వ్యాధి కలవరపెడుతోంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో వ్యాధి తీవ్ర స్థాయిలో విస్తరిస్తోంది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సుమారు 100 కేసులు నమోదైనట్లు తెలిసింది. గుముడాల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వ్యాధి బారిన పడిన వారిలో ఎక్కువగా 16 నుంచి 19 ఏళ్లలోపు వారే ఉన్నారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రతన్‌లాల్ మాట్లాడుతూ.. ప్రజలు చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధి సోకిన వారికి చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. కండ్ల కలక వ్యాధితో బాధపడే వారికి కొంత దూరంగా ఉండాలని సూచించారు. అదే విధంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

దెబ్బతిన్న పంటలకు మందుల పిచికారీ



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పరిగి: వర్షాలకు దెబ్బతిన్న పంటలను రైతులు కాపాడుకోవాలని ఏరువాక కేంద్రం, తాండూర్ శాస్త్రవేత్త శేఖర్, యమునారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. మంగళవారం సయ్యద్ మల్కాపూర్, రాఘవపూర్, కుదావంద్‌పూర్, సయ్యద్‌పల్లి గ్రామాల్లో వారు పర్యాటించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించామని తెలిపారు. పాడైన పంటలకు అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసి, కాపాడుకునేందుకు శ్రద్ధ తీసుకోవాలని రైతులకు సూచించారు. ఏదైనా సలహాలు, సూచనలు అవసరం ఉంటే ఏఈఓను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో పరిగి వ్యవసాయ సంచాలకులు లక్ష్మీకుమారి, ఏఓ ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు చంద్రకళ, దివ్య, శశాంక్, సర్పంచ్ పాహిమాబేగం, ఎంపీటీసీ జంగయ్య, రైతుబంధు కోఆర్డినేటర్ హన్మంతురెడ్డి, రాశిసీడ్స్ ప్రతినిధి నాగేశ్వర్, రైతులు జగదీశ్వర్, లింగం, ఖలీల్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం ఇవ్వండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

వికారాబాద్ అర్బన్: ముదిరాజ్ వీరుడు పండుగల సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరుతూ మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కౌన్సిలర్ గోపాల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, వేణుగోపాల్, నాగయ్య, ముదిరాజ్ ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, లక్ష్మణ్ ఉన్నారు.

ప్రభుత్వాలకు బుద్ధి చెబుదాం

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఎన్నికైన రఘును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

షాద్‌నగర్: సమాజంలోని అవినీతి పరులను అంతం చేయడం గిరిజనులతోనే సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ ఎస్టీసెల్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీసెల్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఎన్నికైన రఘును ఘనంగా సన్మానించారు. అనంతరం వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో దళిత, గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశబూరు. బీజేపీకి చెందిన ఎంపీనే గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారంటే ఆ పార్టీకి గిరిజనులపై ఉన్న ప్రేమ స్పష్టం అవుతోందన్నారు. బీజేపీ నాయకులు గిరిజనులను ఓటు అడిగే హక్కును కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు జరిగే అన్యాయాలపై కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు పార్టీ నేతలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, అందె మోహన్, ఖదీర్, శ్రీను నాయక్, రాజు, సుక్యా నాయక్, సీతారాం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'మాకు రక్షణ చట్టం కావాలి'

- లాయర్‌ను హత్య చేయడం అమానుషం
- నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కొడంగల్ రూరల్: న్యాయవాదులకు రక్షణ లేదు. మాకో చట్టం కావాలి అని కొడంగల్ బార్ అసోసియేషన్ లాయర్లు డిమాండ్ చేశారు. సోమవారం అద్దంకిలో కోర్టు నుంచి ఇంటికి బయలుదేరుతున్న క్రమంలో న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబుపై దుండగులు దాడి చేసి హత్య చేయడాన్ని ఖండిస్తూ.. విధులు బహిష్కరించి మంగళవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కక్షిదారుల సమస్యలపై కోర్టులో వాధించే తమపై దాడి చేయడం సరైంది కాదని, దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి భాగ్యలత, ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు ప్రకాష్‌రావు, వెంకట్‌రెడ్డి, మధుసుదన్ రెడ్డి, రాములు, కరుణాకర్‌రెడ్డి, ఆనంద్, బస్వరాజ్, వెంకటయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి, మురళీమోహన్ నామాజీ, న్యాయవాదులు కృష్ణయ్య, రమేష్, రాములు, రవీందర్ నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి సారూ!



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డులు

అనంతగిరి: హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం జిల్లా ప్రతినిధులు ఎస్పీ కోటిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు చాంద్‌పాషా, విశ్వనాథం, గిరి దశరథ్, కిషన్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల మధ్య 'సోయం' చిచ్చు

ఎంపీపై చర్యలకు డిమాండ్



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: లంబాడాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ సోయం బాబురావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఎస్పీకి వినతిపత్రం అందజేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆదివాసీ గిరిజనుల మధ్య గొడవ పెడుతున్నారని, లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఎంపీపై చర్యలు తీసుకోవాలని, లేని యెడలా ఆందోళనలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, అరుణ్‌నాయక్, అనిల్‌నాయక్, గణేశ్ నాయక్, అంబర్‌సింగ్ నాయక్, వినోద్ నాయక్, శివరాంనాయక్, అరుణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష లేకుండా క్రమబద్ధీకరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

అనంతగిరి: సెకండ్ ఏఎన్‌ఎంలను రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని పలువురు ఏఎన్‌ఎంలు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

జీపీ కార్యాలయంలో పాము కలకలం

కేశంపేట: గ్రామ పంచాయతీ భవనంలోకి తరుచూ పాములు వస్తుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని సుందరపురం గ్రామ పంచాయతీ భవనం చెరువుకు సమీపంగా ఉండడం, భవనం శిథిలావస్థకు చేరడంతో నిత్యం పాములు సంచరిస్తున్నాయని వారు వాపోతున్నారు. మంగళవారం విధులకు వెళ్లిన సిబ్బంది పామును గుర్తించి బయటకు పంపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, సిబ్బంది కోరుతున్నారు.

అప్పు చేసి మావాటా చెల్లించాం



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

- మూన్నెళ్లు గడిచినా యూనిట్ల ఊసేలేదు
- గొర్రెల పంపిణీ చేపట్టాలి
- కాపరుల సహకార సంఘం డిమాండ్

తాండూరు టౌన్: 'రెండో విడత గొర్రెల పంపిణీ గురించి ప్రభుత్వం ప్రకటన చేయగానే.. ఒక్కొక్కరి వాటా కింద రూ.43,750లను అప్పు చేసి చెల్లించాం. మూడు నెలలు గడిచినా యూనిట్ల పంపిణీ చేపట్టం లేదు' అని తాండూరు మల్లికార్జున ప్రాథమిక గొర్రెల, మేకల సహకార సంఘం నాయకులు వాపోయారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తమవాటా కింద అప్పు చేసి చెల్లించామని, అధిక వడ్డీ కడుతూ ఆర్థికంగా నష్టపోతున్నామని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గొర్రెల పంపిణీ చేపట్టాలని పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు శాంతకుమార్, సర్పంచ్ సాయిలు, నాయకులు గౌరీ వెంకటేశం, నర్సింహులు, వెంకటయ్య, అన్నమయ్య, పాండు, మల్లేశం, శివప్ప, శ్రీనివాస్, శేఖర్ ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



షాబొద్దీన్ మృతదేహం (ఇన్‌సెట్లో) మృతుడు(ఫైల్)

దౌల్తాబాద్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగాయిపల్లికి చెందిన షాబొద్దీన్(38), రాములు కలిసి పనిమీద బైక్‌పై ఉదయం దౌల్తాబాద్ వచ్చారు. నందారం గ్రామానికి చెందిన ప్రకాష్ తన అవ్వను బైక్‌పై ఎక్కించుకుని దౌల్తాబాద్ వస్తున్నాడు. అయితే షాబొద్దీన్ పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా దౌల్తాబాద్ పెద్ద చెరువు కట్టపై ఎదురుగా వస్తున్న ప్రకాష్ బైక్ ఢీకొట్టింది. దీంతో షాబొద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రెండు బైక్‌లపై ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా షాబొద్దీన్ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

'ఆమనగల్లు లయన్స్'కు అవార్డుల పంట



లయన్స్ క్లబ్ మల్టీపుల్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి నుంచి అవార్డులు అందుకుంటున్న సభ్యులు

ఆమనగల్లు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ద్వారా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఈసారి అవార్డుల పంట పండింది. సికింద్రాబాద్‌లోని కేవీఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం అవార్డులు అందజేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డికి విజన్ లీడర్ అవార్డు, బావండ్ల వెంకటేశ్‌కు మల్టీపుల్ రీజియన్ చైర్మన్, ఆమనగల్లు క్లబ్ మాజీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డికి బెస్ట్ మల్టీపుల్ అధ్యక్షుడిగా, పాషకు బెస్ట్ పీఆర్‌ఓగా అవార్డులు దక్కాయి. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ సునీల్‌కుమార్, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ నరేందర్‌రెడ్డి, జూలూరి రఘు, డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ్ బట్టడ్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి కొర్వి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం



బిట్టుకుమార్‌ను బాబాయికి అప్పగిస్తున్న పోలీసులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో గతనెల 28న అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ జి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్‌కుమార్ తన సోదరుడి కుమారుడు బిట్టుకుమార్(12)ని చదివించేందుకు తిమ్మాపూర్‌కు తీసుకొచ్చాడు. ఇష్టంలేని బాలుడు గత నెల 28న ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా తిమ్మాపూర్ స్టేషన్‌లో సికింద్రాబాద్ వైపునకు వెళ్లే రైలు ఎక్కాడు. పక్క సీట్లో ఉన్న ప్లాసీ అనే మహిళ బాలుడి వివరాలు ఆరాతీయగా పొంతలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి ఆమె బాలుడిని తనతో పాటుగా నగరంలోని కాటేదన్‌లో ఉన్న తన నివాసానికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో బాలుడు తనను చేరదీసిన మహిళ ఫోన్ నుంచి ఆగస్టు 31న రాత్రి తన బాబాయి సంతోష్‌కుమార్‌కు ఫోన్ చేసి మాట్లాడాడు. వెంటనే ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి కాటేదన్ చేరుకుని బాలుడిని అదుపులోకి తీసుకుని ఫిర్యాదు దారుడు సంతోష్‌కుమార్‌కు అప్పగించారు.